క్లుప్తంగా

ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవస్థానానికి ధర్మకర్తల మండలి నియమించేందుకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రకటన వెలువడిన 10 రోజుల్లో నల్లగొండ కార్యాలయంలో దరఖాస్తుదారులు తమ దరఖాస్తులను అందించాలని ఆలయ ఈఓ గుజ్జుల కొండారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

హైకోర్టు పీపీకి శుభాకాంక్షలు



హైకోర్టు పీపీ నాగేశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాగన్నగౌడ్

హుజూర్‌నగర్ : ఇటీవల హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన హుజూర్‌నగర్ ప్రాంత వాసి ప్రముఖ న్యాయవాది పల్లె నాగేశ్వరరావును శుక్రవారం ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ హైదరాబాద్‌లోని హైకోర్టులో గల పీపీ ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీ చంద్రశేఖర్, బి.విజయకుమార్ యాదవ్, ఎండీ షరీఫ్, అడ్వకేట్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

కేతిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంచీలు అందజేత



పాఠశాలకు బెంచీలను అందజేస్తున్న దాత వెంకటేశ్వరరెడ్డి

మునగాల : మండల కేంద్రంలో గల తెలంగాణ ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన కేతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, తన కేతిరెడ్డి ఫౌండేషన్ ద్వారా రూ.రెండు లక్షల విలువ గల డ్యూయల్ డెస్క్ బెంచీలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మద్దూరి సాయిఈశ్వరి మాట్లాడుతూ కేతిరెడ్డి ఫౌండేషన్ ద్వారా బెంచీలు అందజేయడం అభినందనీయమన్నారు. దాత కేతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డికి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

వాసవీ క్లబ్ చేయూత



వెంకన్నకు ఆర్థికసాయం అందజేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులు ఆకుల వెంకన్న- లక్ష్మీ కుమారుడు అనారోగ్యంతో బాధపడుతుండడంతో వైద్య ఖర్చుల నిమిత్తం కోదాడ వాసవీ క్లబ్ సభ్యులు శుక్రవారం వారి ఇంటికి వెళ్లి రూ.30,617ల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు వంగవీటి నాగరాజు మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు వాసవీ క్లబ్ ఎప్పుడు ముందుంటుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చిత్తలూరి భాస్కర్‌రావు, కోశాధికారి వెంపటి ప్రసాద్, చల్లా లక్ష్మీనర్సయ్య, చల్లా విజయ్‌శేఖర్, ప్రసాద్, లోకేశ్వరరావు, సతీష్‌బాబు, శ్రీనివాసరావు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలకు ఫ్యాన్లు బహూకరణ



ఫ్యాన్లు అందజేస్తున్న దాత కందిబండ వాసంతి

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌నగర్ ప్రాథమిక పాఠశాలకు ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షురాలు కందిబండి వాసంతి- హరిప్రసాద్ కుమారుడు కిరణ్‌కుమార్ జన్మదినం సందర్భంగా రెండు సీలింగ్ ఫ్యాన్లను ప్రధానోపాధ్యాయురాలు సరితకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సరిత మాట్లాడుతూ దాతలు ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యాయురాలు మహాలక్ష్మి, రాచకొండ శ్రీనివాస్‌రావు, కొత్త లక్ష్మణ్, రాధిక, భాగ్యలక్ష్మి, సతీష్, ఉపాధ్యాయురాళ్లు అనసూయ, అంగన్‌వాడీ టీచర్ పాపమ్మ ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నడిగూడెం : మాదకద్రవ్యాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ఏఎస్‌ఐ జగన్ కోరారు. గురువారం నడిగూడెం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో మాదక ద్రవ్యాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు అలవాటై తమ జీవితాలను ఆగం చేసుకోవద్దని సూచించారు. పోలీస్ సిబ్బంది సక్రు, వెంకటేశ్వర్లు, ప్రజలు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- పాలేరు వాగులో తవ్వకాలు
- రాత్రి వేళలో తరలింపు
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- పంటలకు నీరందక రైతులకు తిప్పలు



ఇటీవల కోదాడ రూరల్ పోలీసులకు పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

కోదాడరూరల్ : కోదాడ పరిసర ప్రాంతంలో ప్రవహిస్తున్న పాలేరు వాగు నుంచి అక్రమ ఇసుక తరలింపు యథేచ్ఛగా కొనసాగుతోంది. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రాత్రిపగలు ఇసుకను రవాణా చేస్తున్నా అక్రమ వ్యాపారులపై చర్యలు కరువయ్యాయి. కొత్తగా ఇంటిని నిర్మించుకునే వారి నుంచి, ప్రభుత్వ అభివృద్ధి పనులు చేసే కాంట్రాక్టర్ల నుంచి కొన్ని ట్రాక్టర్లకు అనుమతి తీసుకొని వీరు అదే అనుమతులపై ఎక్కువ ట్రిప్పులను రవాణా చేస్తున్నారు. పగలు అక్రమంగా ఇసుక రవాణ చేస్తే ట్రాక్టర్ సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించడంతో రాత్రి సమయంలో ఇష్టానుసారంగా కోదాడ పట్టణానికి తరలిస్తున్నారు. దీంతో పాలేరు వాగులో ఇసుక ఖాళీ కావడంతో భూగర్భ జలాలు గణనీయంగా పడి పోయాయని, వాగు పక్కన పెట్టుకున్న మోటార్లకు నీరందడం లేదని చుట్టు పక్కల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఇసుక దందాపై అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తుండటంతోనే ఆ వ్యాపారులు ఇష్టమొచ్చినట్లు తవ్వితీస్తున్నారని ఆయా గ్రామాల రైతులు అంటున్నారు. ఈ ఇసుక వ్యాపారం అధికారులకు తెలిసే జరుగుతుందని, మాముల్లు పుచ్చుకుంటూ రవాణాకు సహకరిసున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ గ్రామాల్లోనే తవ్వకాలు

కోదాడ మండలంలోని మంగళితండా, రామాపురం క్రాస్‌రోడ్, రెడ్లకుంట శివారు నుంచి పారుతున్న పాలేరు వాగు నుంచి ఇసుకను తవ్వి తరలిస్తున్నారు. సాయత్రం ఆరు నుంచి ఉదయం ఆరు గంటల లోపు ట్రాక్టర్లను వాగు దగ్గరకు తీసుకెళ్లి కూలీలతో ఇసుకను ట్రాక్టర్లలో నింపుతున్నారు. ఇక్కడ ఇసుకను తీసేందుకు ఆయా గ్రామాలలో ప్రత్యేక కూలీలుంటారు. గ్రామాలలో సెంటు భూమి లేని వారు కూడా కేవలం ఇసుక వ్యాపారం కోసం మాత్రమే లక్షల రూపాయలు పెట్టి ట్రాక్టర్‌లు కొనుగోలు చేసారంటే ఈ దందా ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

పట్టించుకోని అధికారులు !

ఇసుక దందా భారీ స్థాయిలో జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నారు. వాగు నుంచి తవ్వితీసిన ఇసుకను నల్లబండగూడెం మీదుగా నేరుగా ట్రాక్టర్లు జాతీయ రహదారిపై కోదాడకు వస్తున్నా రెవెన్యూ, పోలీసు అధికారులకు ఎందుకు కనిపించడం లేదని పలువురు అంటున్నారు. ఇసుక దందాపై ఆయా గ్రామాల ప్రజలు ఫిర్యాదులు చేసినప్పుడు వారి నుంచి విమర్శలు రాకుండా అప్పుడపుడు పట్టుకొని కేసులు, జరిమానాలు విధించి వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

- డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నిరంజన్



మాధవరాయినిగూడెంలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ నిరంజన్

హుజూర్‌నగర్ : పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం చేసుకోవచ్చని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నిరంజన్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని మాధవరాయినిగూడెంలో దోమల నివారణ చర్యలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇళ్ల పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెంది మలేరియా, డెంగ్యూ, బోదకాలు, చికున్ గున్యా మెదడు వాపు వంటి వ్యాధులు ప్రబలుతాయని తెలిపారు. వారానికి ఒకరోజు డ్రై డే పాటించాలన్నారు. మండల వ్యాప్తంగా ఐదు టీమ్‌లతో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తూ లార్వా నిర్మూలన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గంగరాజు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కవిత వ్యాఖ్యలు హాస్యాస్పదం

కోదాడ : అధికారంలో ఉన్న సమయంలో అక్రమాలకు పాల్పడిన బీఆర్‌ఎస్ నాయకురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలకు దిగడం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ముత్తవరపు పాండురంగారావు, వంగవేటి రామారావు అన్నారు. శుక్రవారం కోదాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో డీజీపీగా పని చేసిన మహేందర్‌రెడ్డిని కాంగ్రెస్ ప్రభుత్వం టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్‌గా నియమిస్తే ఆమె ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. నిన్నటి వరకు మంచివాడని చెప్పిన కవిత ఇప్పుడు ఆయనపై ఆరోపణలు చేయడం ఏంటని ప్రశ్నించారు. లిక్కర్ కుంభకోణంలో నిందితురాలిగా ఉన్న కవిత బీజేపీతో కుమ్మక్కై అరెస్టు కాకుండా బయటపడిందని తెలంగాణ ప్రజలు బీఆర్‌ఎస్, బీజేపి బంధాన్ని గమనిస్తున్నారని వారు అన్నారు.

ఎస్టీయూ రాష్ట్ర మహిళా కోకన్వీనర్‌గా వెంకటరమణ

కోదాడఅర్బన్ : ఎస్టీయూ రాష్ట్ర మహిళా కో కన్వీనర్‌గా హుజూర్‌నగర్ మండలం గోపాలపురం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న మీసాల వెంకటరమణను నియమిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా వెంకటరమణను ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓరుగంటి నాగేశ్వరరావు, బంధం వెంకటేశ్వర్లుతో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు సన్మానించారు.

మాజీ పాలకవర్గ సభ్యులకు సన్మానం



సన్మానం పొందిన పంచాయతీ మాజీ పాలక వర్గ సభ్యులు

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్లలో తాజా మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహరాజు, పాలకవర్గ సభ్యులను గ్రామస్తులు శుక్రవారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణంరాజు, శాంతి నరసింహారెడ్డి, నాగయ్యాయాదవ్ మాజీ వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి



హుజూర్‌నగర్ : కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను



మఠంపల్లి : సమ్మె కరపత్రం ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

హుజూర్‌నగర్ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న నిర్వహించబోయే దేశవ్యాప్త పారిశ్రామిక గ్రామీణ బంద్ ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె కరపత్రం ఆవిష్కరించారు. అనంతరం సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు శీలం వేణు, పి.వెంకన్న, ముస్తఫా, సైదులు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మె కరపత్రం ఆవిష్కరణ

నేరేడుచర్ల : ఈనెల 16వ తేదీన జరగనున్న దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు కోరారు. శుక్రవారం నేరేడుచర్లలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో పాల్గొని సమ్మె కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు పాతూరి శ్రీనివాస్‌రావు, ఎస్‌కె.సత్తార్, రవీందర్, మట్టయ్య, నాగరాజు, శ్రీను, భిక్షం, దశరథ, ఖరీముల్లా, రహీముతుల్లా, కోటయ్య తదితరులు ఉన్నారు.

మఠంపల్లిలో..

మఠంపల్లి : ఈనెల 16న నిర్వహించబోయే దేశవ్యాప్త సమ్మె కరపత్రాన్ని శుక్రవారం మఠంపల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో హమాలీ సంఘం కార్మికులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సయ్యద్‌రసీమియా, గురువయ్య, నవీన్, ప్రభుదాస్, గోపి, శ్రీను, బాబు, జోజి పాల్గొన్నారు.

ఖాతాదారుల శ్రేయస్సే సుధా బ్యాంకు లక్ష్యం



బీమా చెక్కు అందజేస్తున్న బ్యాంకు ఎండీ గణేష్

కోదాడఅర్బన్ : ఖాతాదారుల శ్రేయస్సే సుధా బ్యాంక్ లక్ష్యమని బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ అన్నారు. కోదాడలోని సుధా బ్యాంక్‌లో పట్టణానికి చెందిన బూర్గుల లక్ష్మి 2022లో రూ.4 లక్షల రుణం తీసుకుంది. దీంతో బ్యాంక్ ఆమెకు బీమా సౌకర్యం కల్పించింది. కాగా, ఆమె అనారోగ్యంతో మరణించడంతో ఇన్సూరెన్స్ సంస్థ నుంచి మంజూరైన రూ. 3,54,000ల చెక్కును బ్యాంక్‌లో లక్ష్మి భర్త శ్రీనివాసరావుకు ఎండీ, మేనేజర్‌లు అందజేశారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి గణేష్ మాట్లాడుతూ బ్యాంక్ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంక్ మేనేజర్ రవికుమార్, బ్యాంక్ సిబ్బంది పాల్గన్నారు.

సీపీఎం నాయకుడు పున్నంరాజు వర్ధంతి



మఠంపల్లి : యాతవాకిళ్లలోని పున్నంరాజు స్మారకస్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్లకి చెందిన సీపీఎం సీనియర్ నేత అమరజీవి కోలాహలం పున్నంరాజు 36వ వర్ధంతిని శుక్రవారం గ్రామంలో ని ర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారక స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోలాహలం లక్ష్మీనరసింహరాజు, మాజీ సర్పంచ్‌లు కృష్ణంరాజు, విశాలాంధ్ర, పద్మ, ఉపసర్పంచ్ శాంతి, వెంకటేశ్వర్లు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఎల్లావుల నాగయ్యాయాదవ్, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, పాండునాయక్, వట్టెపు సైదులు, మాలోతు బాలు, ములకలపల్లి సీతయ్య, తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లిలో..

మఠంపల్లి మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం పున్నంరాజు వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జగన్ మోహన్‌రెడ్డి, పాండునాయక్, బాలునాయక్, రాము, రసీమియా తదితరులు పాల్గొన్నారు.

పున్నంరాజుకు నివాళి

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని శ్రీనివాసపురంలో సీపీఎం సీనియర్ నాయకుడు దివంగత కోలాహలం పున్నంరాజు 36వ వర్ధంతిని శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి పోషనబోయిన హుస్సేన్, నాయకులు వెంకటచంద్ర, నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీను, చినగోపాల్‌రావు, స్వామి, శశికల, సురేష్, సైదమ్మ, వెంకటమ్మ, బిందు, చిట్టెమ్మ, సీతారామరాజు, తదితరులు ఉన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కంట్రిబ్యూటరీ పెన్షన్ ఉద్యోగుల సంఘం నాయకులు

గరిడేపల్లి : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కంట్రిబ్యూటరీ పెన్షన్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు పనితి ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి భూక్య రమేష్ కోరారు. శుక్రవారం గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంఘం టేబుల్ క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సువర్ణ, రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పాలూరు అంజయ్య, సత్తూరి భిక్షం, పిట్ట వీరస్వామి, పెండెం వీరస్వామి, మంగమ్మ, నర్సిరెడ్డి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

హన్మంతరావుకు నివాళి



హన్మంతరావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామ పంచాయతీ పరిధిలోని గంటవారిగూడెంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత తోట హన్మంతరావు మృతదేహానికి శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హన్మంతరావు కుమారుడు కాంగ్రెస్ నాయకుడు శ్రీనును పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వల్లంశెట్ల లచ్చయ్య, నాయకులు కృష్ణయ్య, కౌన్సిలర్ బచ్చలకూరి ప్రకాశ్, సురేష్, రామకృష్ణ, బార్గవ సైదులు, నాగరాజు, సైదులు, మట్టయ్య, రవి, తదితరులు ఉన్నారు.

సీఐటీయూలోకి అంగన్‌వాడీలు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్ సెక్టార్ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్లు టీఆర్‌ఎస్‌కేవీ సంఘానికి రాజీనామా చేసి సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ చెరుకు యాకలక్ష్మి పాల్గొని మాట్లాడారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

- అదనపు ఎస్పీ ఎం.నాగేశ్వరరావు



హుజూర్‌నగర్ : జాతీయ భద్రత మాసోత్సవంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ఎం.నాగేశ్వరరావు



కోదాడఅర్బన్ : కోదాడ లారీ అసోసియేషన్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్పీ ప్రకాష్

హుజూర్‌నగర్ : డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలని అదనపు ఎస్పీ నాగేశ్వరరావు అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవంలో భాగంగా శుక్రవారం హుజూర్‌నగర్‌లోని లారీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోదాడ డీఎస్పీ ప్రకాష్, సీఐ రామలింగారెడ్డి, ఎస్ఐ మల్లేశం, డ్రైవర్‌లు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో రోడ్డు ప్రమాదాల నివారణ

కోదాడఅర్బన్ : రోడ్డు నియమ నిబంధనలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉంటే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని కోదాడ డీఎస్పీ ప్రకాష్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బాబు అన్నారు. శుక్రవారం కోదాడలోని లారీ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 35వ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణాలు అని తెలిపారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై లారీ యజమానులకు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. అనంతరం రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ రాము, ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి, కోదాడ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కనగాల నాగేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ చైర్మన్ రామినేని శ్రీనివాసరావు, తూనం కృష్ణ, యలమందల నర్సయ్య, పైడిమర్రి వెంకటనారాయణ, గుండపనేని నాగేశ్వరరావు, విలాసకవి నరసరాజు, అలేటి రాంబాబు, పెద్ది అంజయ్య, రఫీ, లారీ డ్రైవర్లు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

మునగాల : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శుక్రవారం మునగాల మండలంలో 2022 ఏప్రియల్ నుంచి 2023 మార్చి వరకు నిర్వహించిన ఉపాధి హామీ పనులపై 14వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు వివరాలు వెల్లడించారు. మండల వ్యాప్తంగా రూ.4,30,69,043 పనులు చేపట్టగా ఇందులో రూ.4.13కోట్లు వేతనాలకు గాను, రూ.17,65,000 మెటీరియల్‌కు వెచ్చించినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.4.15,765 రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ సుందరి కిరణ్‌కుమార్, ఎంపీపీ ఎలక బిందు, ఎస్.ప్రవీణ్‌కుమార్ హెచ్.మేనేజర్, అంబుడ్స్‌మెన్ లచ్చిరామ్ నాయక్, ఓపీఓ అన్సారీ, ఏపీడీ ఎర్రయ్య, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏపీఓ శైలజ, ఎస్‌ఆర్పీ రమేష్, డీఆర్‌పీలు, ఈసీ కళ్యాణ్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'మైహోం' ఆధ్వర్యంలో మెగా పశువైద్య శిబిరం



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మైహోం పరిశ్రమ అధికారి, జిల్లా పశువైద్యాధికారి

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లి గ్రామంలో మైహోం సిమెంట్స్ పరిశ్రమ, జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత మెగా పశువైద్య శిబిరాన్ని పరిశ్రమ ప్రెసిడెంట్, యూనిట్ హెడ్ ఎస్.శ్రీనివాసరావు, జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మూగజీవాలకు పశు వైద్యులు చికిత్స చేసి, టీకాలు వేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పార్వతీకొండానాయక్, మాజీ ఎంపీపీ కె.లక్ష్మీవెంకటనారాయణ, మైహోం సిమెంట్స్ జీఎం నాగేశ్వరరావు, మైన్స్ జీఎం శ్రీనివాసరావు, అడ్వైజర్ జగన్నాథరావు, పశువైద్యాధికారులు, వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

సీతారామాలయం ముస్తాబు



విద్యుత్ కాంతులతో సీతారామాలయం

మఠంపల్లి : మండల కేంద్రంలోని సాగర్ సిమెంట్స్ కాలనీలో గల శ్రీసీతారామాలయం 11వ వార్షికోత్సవాన్ని ఈనెల 10 నుంచి 13వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. 10న అంకురారోపణ, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, తిరుకల్యాణం, 11న విశేషహోమాలు, గోపూజ, 12న చక్రతీర్థస్నానం, 13న సుదర్శనం హోమం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

'గృహజ్యోతి'ని సద్వినియోగం చేసుకోవాలి



బేతవోలులో గృహజ్యోతి పథకానికి సంబంధిత పత్రాలు అందజేస్తున్న వినియోగదారులు



నల్లబండగూడెంలో వివరాలు నమోదు చేసుకుంటున్న ఎంపీడీఓ

కోదాడరూరల్ : గృహజ్యోతి పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాంచందర్‌రావు అన్నారు. శుక్రవారం కోదాడ మండలంలోని నల్లబండగూడెంలో గృహజ్యోతి పథకానికి సంబంధిత వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు కావాల్సిన పత్రాలను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ పాండురంగన్న, కార్యదర్శి అరుణ, మమత తదితరులు ఉన్నారు.

గృహజ్యోతి పథకానికి పత్రాల స్వీకరణ

చిలుకూరు : మండల వ్యాప్తంగా గ్రామాల్లో శుక్రవారం గృహజ్యోతి పథకానికి విద్యుత్‌శాఖ అధికారులు సంబంధిత పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజాపాలన దరఖాస్తు రశీదుతో పాటు ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు, రేషన్ కార్డు జిరాక్స్‌లను జత చేసి వినియోగదారులు అందజేశారు.

దరఖాస్తుల్లో తప్పులను సరిచేసి ఆన్‌లైన్ చేస్తాం



తప్పుగా నమోదైన గ్యాస్ కనెక్షన్ నంబర్ల లిస్టును పరిశీలిస్తున్న సీపీఓ జి. వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ

చిలుకూరు : ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పుగా నమోదైన గ్యాస్ నంబర్లను సరి చేసి ఆన్‌లైన్ చేస్తామని మహాలక్ష్మి పథకం కోదాడ నియోజకవర్గ ప్రత్యేక అధికారి, సీపీఓ జి.వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం చిలుకూరు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో తప్పుగా నమోదయిన గ్యాస్ కనెక్షన్ నంబర్ల జాబితా తనిఖీని ఆయన పరిశీలించి మట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఈదయ్య, గ్రామ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్ వివరాలు నమోదు

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లి గ్రామంలో మహాలక్ష్మి పథకంలో భాగంగా గ్యాస్ కనెక్షన్ల వివరాల తప్పులను సరిచేయు ప్రక్రియను శుక్రవారం మండల స్పెషల్ ఆఫీసర్, ఏడీఏ సంధ్యారాణి, తహసీల్దార్ మంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఆంజనేయులు, ప్రత్యేక అధికారి, కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

వీరశేఖర్ మృతి బాధాకరం

నడిగూడెం : మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న వీరశేఖర్(35) అకాల మృతి బాధాకరమని ఎంపీపీ యాతాకుల జ్యోతి అన్నారు. శుక్రవారం వీరశేఖర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె వెంట జెడ్పీటీసీ బాణాల కవిత, ఎంపీడీఓ ఎస్‌డి.ఇమామ్, పలువురు ప్రజాప్రనిధులు, అధికారులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.